# కాకిగూటిలో కోయిల స్థానం



డాక్టర్ కె.వి. కృష్ణకుమారి

ఎదురింట్లోంచి మంగళవాయిద్యాలు మధురంగా వినిపిస్తున్నాయి. ముంగిట ముగ్గులతో - పచ్చని తోరణాలతో - పసిమివన్నెలతో పండు ముత్తయిదువలతో - ఆ యిల్లు కళకళలాడుతుంది.

ముంజేతిని కప్పుకున్న రాజశేఖరం గారి కళ్ళు బరువుగా మూసుకున్నాయి. తన కొలకులలోంచి కన్నీరు వెచ్చగా జారింది.

ఏదో ఆవేదన -

మరపురాని గతం - మర్చిపోలేని వర్తమానం.

గాఢమైన నిట్టూర్పు గుండెలోని గాయాన్ని మరొకసారి కెలికింది. అసహనంగా లేవబోతున్న రాజశేఖరంగారి అరచేతి క్రింద శుభలేఖ పెళుసుగా పలకరించింది. వణుకుతున్న చేతులు అప్రయత్నంగా దాన్నందుకున్నాయి మండుతున్న గుండెలు మరొక్కసారి చదువుకున్నాయి.

'చి॥ భాస్కర్ కి ___ చి॥ సౌ॥ ప్రతిమ నిచ్చి' -

"భాస్కర్‌కి ప్రతిమ నిచ్చి" గొణుక్కున్నట్టు పైకిలేచిన ఆయన కళ్ళు తొణికి శుభలేఖను బరువుగా పరామర్శించాయి. అప్రయత్నంగా ఆయన చూపులు పెళ్ళిగుమ్మం ముందు నిల్చిపోయాయి. తన కళ్ళముందు పెరిగిన భాస్కర్, నూతన వధువతో ముచ్చటగా నిలబడి వున్నాడు తనలాంటి వాళ్ళకు సవాల్‌గా !

"మరి తన బాబు లాంటి వాళ్ళకు ?"

చేతులు వణికి - శుభలేఖ జారి క్రింద పడింది, తను చెయ్యిజార్చుకున్న ఎన్నో వాటి లాగానే.

దూరంగా ... తన కళ్ళముందు రూపం దాల్చిన కాకిగూడు కాకిగోలతో హోరెత్తిపోతోంది.

ఎన్నో ఎర్రని పసినోళ్ళు ఆశగా గూడును చీల్చుకుని ఆదేపనిగా అరుస్తున్నాయి. తల్లికాకి రివ్వున గూడుచుట్టూ తిరుగుతూ - ముక్కున కరుచుకున్న ఆహారాన్ని పిల్లలకు పెట్టే సన్నాహంలో వుంది. పిల్లగా బలిష్టంగా వున్న మరో కాకి - బలంగా రెక్కలు వూపుకుంటూ, గూటికి సమీపంగా వాలి తల్లినుంచి ఆహారం అందుకుంటున్న పిల్లల్ని మౌనంగా గమనిస్తూ - మరుక్షణంలో గుండెలు అదిరేలా అరుపులు మొదలు పెట్టింది. భీకరంగా అరుస్తూ గూడు కదిలేలా, రెక్కలు విసురుతున్న కాకిని, బెదిరిన పసివాటిని — నిస్సహాయురాలైన తల్లిని .. అర్థంకానట్లు చూస్తూ నిలబడిపోయారు రాజశేఖరంగారు.

ఆ పసివాటి ప్రక్కగా - మరొక పసిప్రాణి - మరొకజాతిది, తోడుకోసం వచ్చిచేరిన, రెక్కలు రాని పసిది బిక్కముఖం వేసుకుని, ప్రాణభీతితో తల్లడిల్లిపోతుంది.

మరుక్షణంలో ఎన్నో కాకులు — జరగరాని అన్యాయం జరిగినట్టు ఆ అన్యాయాన్ని రూపుమాపనిదే పరిష్కారం లేనట్టు - కావుకావుమంటూ చెట్టుచుట్టూ కమ్ముకున్నాయి.

తండ్రికాకికి తన లోకులను చూడగానే ఎంతో శక్తి వచ్చినట్టుంది. అడ్డు పడుతున్న ఆడకాకిని సైతం ప్రతిఘటించి, ఆర్తనాదం చేస్తున్న పసివాటిని కూడా లెక్కచెయ్యక ప్రాణభయంతో వణికిపోతున్న - తనజాతికాని పసి ప్రాణాన్ని నిర్దాక్షిణ్యంగా ముక్కున కరుచుకుంది. కాకుల అరుపులు సమర్థిస్తున్నట్టు మిన్నుముట్టాయి.

రాజశేఖరంగారి చేతులు కిటికీ ఊచలను బలంగా పట్టుకున్నాయి. జాతి గౌరవాన్ని కాపాడబోతున్నాననే, ఉన్మత్తతో ఎగురుతున్న కాకినోటిలోని పసి గుడ్డు విలవిలలాడిపోతోంది. విలయ తాండవం చేస్తున్నట్టున్న ప్రకృతినిచూసి గుండె లవిసేలా ఆర్తనాదం చేస్తోంది. రాజశేఖరంగారి కళ్ళు ఆత్రుతతో విచ్చుకున్నాయి.

కాకినోటినుండి జారి క్రిందపడిన ఆ ప్రాణి, గుండెల్ని చీల్చేలా అరిచింది.

రాజశేఖరంగారి కనురెప్పలు భారంగా మూతబడ్డాయి.

* * *

"దయచేసి మమ్మల్ని అర్థం చేసుకోండి - పెద్దవారు, అన్నీ తెలిసిన వారు. అర్థంలేని కులాభిమానంతో, మమ్మల్ని వేరుచేయకండి. మా జీవితాలు నాశనం చెయ్యకండి .." దీనంగా అర్థిస్తున్న విజయని, నిర్లక్ష్యంగా చూసి

చుట్టకొనను కవిస్తున్న కోరిక, తుస్సుక్కున వుమ్మేశారు రాజశేఖరంగారు.

"నేనూ — సత్యంగారూ ప్రాణానికి ప్రాణంగా ప్రేమించుకున్నాం. మన స్సాక్షిగా భార్యాభర్తల మయ్యాము ..." విజయ మాటలు పూర్తవకుండానే రాజ శేఖరంగారి కళ్ళు నిప్పులు కక్కాయి.

"భార్యాభర్తలు." పళ్ళు కొరు కుతూ తనని భస్మం చేసేలా చూస్తున్న ఆయన చూపులకు చిగురాకులా వొణికి పోయింది విజయ

"మా వాడికి భార్య కావటానికి, నీ కున్న అర్హత లేమిటి ?..." హీనంగా చూస్తున్న ఆయన చూపులనుంచి దృష్టి మరల్చుకుంటూ గుండెను చిక్కబట్టు కొని మెల్లగా తలయెత్తింది.

"మనువుకు మంచిమనసును మించిన అర్హత లేదనుకున్నాము. కలిసిన మన సులను, పవిత్రమైన అంతరంగాల్ని విడ దీసే శక్తి - స్వార్థపరులు కల్పించిన కులమతాలకు లేదనే విశ్వసించాము అగ్నిసాక్షిని మించిన శక్తి, ఆత్మసాక్షి కుందన్న నమ్మకంలో మంత్రాలకు లేని విలువ అర్థంచేసుకున్న హృదయాల కుందన్న విశ్వాసంతో వేమూ.."

రౌద్రంగా చూస్తూ ఖాండ్రించి వుమ్మేశారు రాజశేఖరంగారు.

"మాటలు నేర్చావు గనుకనే మా వాడిని బుట్టలో వేసుకున్నావ్..." దెబ్బ తిన్నట్టు చూస్తున్న విజయని చూసి ఛీత్కారం చేసారాయన !

"కులాభిమానాన్ని బజార్లో పెట్టి - పెద్దవాళ్ళు చచ్చారనుకుని - పెళ్ళి చేసు కున్నారుట - పెళ్ళి అదీ మనసు లోట..." హేళనగా నవ్వుతున్న ఆయన వంక విభ్రాంతితో చూస్తూ వుండిపో యింది విజయ

"చూడమ్మాయ్ ..! ఇది నిజజీవితం మనం బ్రతికేది సమాజంలో. ప్రేమ కౌగిళ్ళాలమీదేగాని, జీవితంలో బ్రతకటం కష్టం." ఆయన వ్రేళ్ళమధ్య చుట్ట రవ్వలు కక్కింది.

"కళ్ళు కల్పినంత త్వరగా - కులాలూ వంశగౌరవాలూ కలవటం, కల్పి కల కాలం నిలవడం - అసంభవం...." దృఢంగా మొండిగా అంటున్న ఆయన రక్తంలో జీర్ణించుకుపోయిన కులాభి మానం కసితో బుసకొడుతోంది. మాట నెగ్గితీరాలనే పెద్దరికం మొండిగా సవాలు చేస్తుంది. అప్పటిదాకా కరడుకట్టిన దైన్యం కరిగి కన్నీరై విజయని నిస్స హాయురాల్ని చేసింది. భవిష్యత్ తుఫా నులోని నావలా ఎటో కొట్టుకుపోతు న్నట్టు అన్పించింది.

"చూడమ్మాయ్!... నిజానికి యింత ఇదిగా నీకు చెప్పాల్సినంత వోపిగ్గానీ, అవసరంగానీ నాకు లేదు కాకపోతే జరిగిన తప్పులో మావాడిక్కూడా వాటా వుంది గనుక ..." సూటిగా చూస్తున్న ఆయన చూపులకు విజయపెదాలు అస్ప ష్టంగా కదిలాయి. "జరిగిన తప్పు లోనా ! ..." అవి. నూతిలోంచి వచ్చి

(మిగతా 67 వ పేజీలో)

(64 వ పేజీ తరువాయి)

నట్టున్న, ఆమాట వింటూనే విసురుగా దగ్గరకు వచ్చారు.

“అన్తను తప్పే జరిగింది. మామ్మా టికీ తప్పే. వాడిని మెడికల్ కాలేజీకి పంపింది. కష్టాలు పడి ఇంతదూరం చదివించింది, వాడిమీద ఎన్నో ఆశలు పెట్టుకుని బ్రతుకుతుంది - యీ ఘన కార్యంకోసం కాదు. ఒక కులం గోత్రం లేనిదాన్ని. . .” కాలుతున్న చుట్ట నేలకేసి బలంగా కొట్టారు.

“చేసిన నిర్వాకం చాలమ్మా చాలు. నువ్వు తలుచుకొంటే వాడిని మర్చిపో గలవు. నీకు భర్త దొరక్కపోడు. కానీ.... నాకు...” తీక్షణమైన ఆ కళ్ళల్లో మబ్బుతెరలు కమ్మాయి. ఆవే శాన్ని అణచుకున్న ఆమె పెదాలు బల వంతంగా కదిలాయి.

“మీకు బాధ కలిగిస్తే క్షమించండి. మీ దృష్టిలో మేము కులం తక్కువ వాళ్ళమే. మీరే యెక్కువగా వున్న యీ సమాజం - మీ ప్రభావంతో పునీత మైన యీ సంఘం, మీతో కలిసి జీవించే అర్హతను, మీలో ఒకరిగా గుర్తించబడి గౌరవింపబడే యోగ్యతనూ - ఇప్పుడే కాదు - యెప్పుడూ మాకు అందించదు. అలాగని నేను తరాల అంతరాలను చరించబోవడంలేదు. మారని సమా జాన్ని విమర్శించే తాహతు కూడా లేదేమో. కానీ నా బ్రతుకోసం అర్థి స్తున్నాను. నా జీవితానికి న్యాయం చేకూర్చమంటున్నాను . . .” తలెత్తిన విజయ పెదాలు అపహాస్యంగా, అస హ్యంగా తనవంకే చూస్తున్న ఆయనను చూసి వొణికాయి.

కాలుమీద కాలువేసుక్కూర్చున్న ఆయన - తాపీగా మరొక చుట్ట వెలిగిం చాడు. కరగని శిలలా గంభీరంగా కూర్చున్న ఆయన పెదాలు కదిలాయి. కళ్ళు నవ్వాయి.

అమాయకత్వానికి జాలిపడుతున్నట్టు!

చేతకాని నాన్ని మందలిస్తున్నట్టు!!

‘మత ప్రచారానికి ఇటువంటి సాధ నాలూ, మార్గాలూ కూడా వున్నాయన్న మాట’ ఏంతో తాపీగా అంటున్న ఆయనవంక దెబ్బతిన్నట్టు చూసింది.

“ఏమన్నారూ ?... విజయ మొహం పాలిపోయింది.

“ఉన్నమాటే - అన్నిటిలాగే మత ప్రచారం, దానికోసం ప్రేమ వివా హాలు, ఆదర్శంకోసం వర్ణసంకరాలు, ఆధిపత్యంకోసం అత్యాచారాలూ ..” ఖాండ్రించి వుమ్మేస్తున్న ఆయనలో మూర్తీభవించిన మతమౌఢ్యం !

విజయ వెనకడుగు వేసింది.

మమకారాన్ని మరపుకు తెచ్చే పెద్ద రికం, ప్రేమాభిమానాల్ని మంటల్లో కోపడానికూడా సిద్ధమయ్యే మూర్ఖత్వం, మానవతను అర్థంచేసుకోలేక, సమాన త్వాన్ని సహించలేక - కాలం పెంచిన వయసుని, వివేకం పెరగనివ్వని బుద్ధిని రాజశేఖరంగారిలో స్పష్టంగా చూస్తూ -

అహంకారం ముందు తలవంచిన

విజయలా తలవంచుకుని వెనుకకు తిరగ బోయింది.

"అమ్మాయ్!.. ఆగు!!.. శాసి స్తున్నట్టు ఆయన గొంతు ఖంగుమంది. నిస్సహాయంగా ఆగిపోయింది.

"సమాధానం చెప్పకుండా వెళ్ళిపో తావేం?.. ఆయన స్వరంలోని అధి కారం కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది.

"ఏం చెప్పమంటారు .!" విజయ గొంతు పీలగా వొణికింది

"వొదిలిపెట్టి వెళ్ళడం న్యాయమేనా?" కరుకుగా వినిపించిదాయన గొంతు.

"వొదిలిపెట్టటమా . . ." జాలిగా నీరసంగా వుందామె చూపు.

"ఏం వదిలిపెట్టవా ??." రెట్టిస్తున్న అతని అహంకారానికి సమాధానం లేనట్టు తలవంచుకుంది.

ఆయన పెదాలు విజయగర్వంతో విచ్చుకున్నాయి సౌమ్యంగా కదల టానికి ప్రయత్నించాయి

"తప్పదమ్మా . . . తప్పదు. త్యాగ మని అనుకునీ నువ్వు సాహసంచెయ్యక తప్పదు." అంటున్న ఆయనవంక విహ్వ లంగా చూస్తూవుండిపోయిన విజయని చూస్తుంటే రాజశేఖరంగారి గుండెల్లో యేదో మూలనుంచి తెలియని సానుభూతి తొంగిచూసింది. అర్థంకాని ఆత్మీయత కల్గింది. కానీ అనాదిగా వస్తున్న వంశ ప్రతిష్ట, అంతకుమించి పెంచుకుంటూ వచ్చిన తన ఒక్కగానొక్క కొడుకుమీద అనురాగం, అన్నింటినీ మించి అతని భవిష్యత్‌మీద పెంచుకున్న విపరీతమైన ఆశలు. తిరిగి ఆయన గుండెను కఠినం చేశాయి.

"చిన్నవాళ్ళ జీవితంలో తప్పటడుగు వేయకుండా వాళ్ళను శాసించి కాపాడవల సిన బాధ్యత పెద్దవాళ్ళమీద వుంటుంది. బాధ్యతాయుతంగా ప్రవర్తించవలసిన వయసులో బాధ్యతారహితమైన నిర్ణయా లకు తలపడితే . . . !

ఆమె కళ్ళు వర్షిస్తున్నాయ్

నీరైన గుండె కన్పిస్తుందా కళ్ళలో.

"అన్నమ్మాయ్ ! . . నా భార్య బాబును నా కందించి నన్ను విడిచి వెళ్ళి పోయింది. అతి కష్టంమీద నిలుపు కుంటూ వచ్చిన వంశగౌరవం, నా కోసం మిగిలిన నెత్తురు గుడ్డు . . . నా బాబు భవిష్యత్; ప్రాణసమానంగా కాపాడుకు వస్తున్న ప్రతిష్ట, నీ చేతిలో వున్నాయి"

ఆయన కంఠంలో ఆవేదన

విజయకళ్లు విస్మయంగా విచ్చుకు న్నాయి.

ఆయన సరిక్రొత్తగా కనిపిస్తున్నారు

కళ్ళల్లోని కఠినత్వం కరుగుతున్నట్టు గుండెలోని పటుత్వం సడలుతున్నట్టని పించింది.

"చెప్పమ్మా . . . వాడిని" ఇప్పుడు యిందాకటిలా శాసించలేకపోయారు.

విజయ కడుపులోని పేగు కలుక్కు మంది క్షణంలో నిస్సత్తువ ఆవహించి నట్టయింది.

"అందుకే నిన్ను పిలిపించింది. మీ సంగతి యింతదూరం వచ్చిందని తెలియక మందలిద్దామనుకున్నా - కానీ ఇప్పుడు ప్రాధేయపడుతున్నా !" . . .

ఆవేదనతో ఏదో చెప్పబోతున్న ఆమె పెదాలు అస్పష్టంగా ఆగిపోయాయి

"మరొక్క మాట - నీతో వాడు చెప్పాడో లేదో- " క్షణం సందేహించా రాయన. "వాడికోసం పెరుగుతున్న - వాడికేనాడో నిర్ణయించిన అమ్మాయి - వేరే వుంది - !" ఆయన మాట పూర్తి కాలేదు. ముందుకు తూలిపడబోతున్న ఆమెని ఆమెలోని ఏదో శక్తి అడ్డుకుంది. తెల్లగా పాలిపోయిన మొహాన్ని పైకెత్తలేక, అప్రయత్నంగా తన రెండుచేతులూ జోడించింది

* *

శూన్యంలోకి చూస్తున్న రాజశేఖరం గారి కళ్ళు నీళ్ళూరుతున్నాయి. నీటి పొరలలోంచి మసగ్గా కన్పిస్తున్న గూడు. నిశ్శబ్దంగా వెక్కిరిస్తున్నట్టనిపించింది తృప్తిగా నాలుకతో మీసాలు దువ్వుకుంటూ ఆకలి తీరినట్టు వెళ్ళిపోతున్న పిల్లిని చూడలేక కన్నీళ్ళు రెప్పలచాటున దాక్కున్నాయి.

* *

"ప్రేమానురాగాలతో పెంచుకున్న నాకన్నా మీకు కులం ముఖ్యమైందికదూ, నా సుఖసంతోషాలను మించి మీరు వంశ ప్రతిష్ఠనే ప్రేమించారు కదూ ??

మీ తరానికి ప్రతినిధిగా అనుకోనంత కఠినంగా ప్రవర్తించి ప్రగతిబాటలో అడుగు పెట్టబోతున్న మామీదే మీ ద్వేషం తీర్చుకున్నారు కదూ ?

ఎవరు నాన్నా నాకోసం పుట్టి పెరుగుతున్న భార్య ??- ఎందుకు నాన్నా అభం శుభం ఎరుగని ఒక అనాథమీద మీకంత కసి ! మీ బిడ్డమీద ప్రేమ మరొకరిబిడ్డ అంతానికి నాంది కావడం ఎంత దారుణం !!

గతం రాజశేఖరంగారి గుండెల్ని తొలుస్తుంది ! మనస్సులో భరించలేని విన్నాటి ఫిరంగి ప్రేలుళ్ళు !!

"అందుకే నాన్నా నా విజయ నన్ను వదిలి వెళ్ళిపోయింది. ఒంటరిగాకాదు కడుపులో పెరుగుతున్న నా ప్రతిరూపంతో - నాలో మమతల్ని రేపుతున్న నా బిడ్డతో - మీరు అమితంగా ప్రేమించే మీ కుల గౌరవం, వంశప్రతిష్ఠనూ మీకే మిగిల్చింది. కానీ నేనే మీకు మిగలకుండా పోతున్నాను ఇది ఆవేశంతో తీసుకున్న నిర్ణయంకాదు, చేతిమీద పొంగే పాలపొంగూ కాదు నా మనస్సాక్షిగా నిర్ణయించుకున్న వుచితమైన నిర్ణయం ..."

"బాబూ . . ." హృదయాంతరాళాలోంచి ప్రతిధ్వనించిన కేకతో యీలోకంలోకి వచ్చారు రాజశేఖరంగారు. ప్రతి క్షణం తన గుండెను మండించే తనసత్యం పుత్తరం. మరొక్కసారి గాయాన్ని కెలికినట్టయింది.

ఎదురింట్లోంచి మంగళవాయిద్యాలు తారస్థాయి నందుకున్నాయి

పచ్చగా విందుగా కన్పిస్తున్న వరుడు

భాస్కర్ వెలుగు చిమ్ముతున్న కళ్ళల్లో తన ఆశాజ్యోతి సత్యం దీనంగా కన్పిస్తుంటే.

జీవిత మధువును గుండెల్లో నింపుకోవాలని జీవన కుసుమాన్ని గుండె ఫ్లవర్ వాజ్ లో పదిలపరుచుకున్న అదృష్టవంతురాలి వదనంలో అమాయకురాలు విజయ కళ్ళనీళ్ళు చిమ్ముతుంటే.

బరువెక్కిన గుండెతో కుర్చీలో వాలిపోయిన రాజశేఖరంగారి కళ్ళు బరువుగా మూతలు పడ్డాయి. వెచ్చని కన్నీటి బిందువులు ఆర్ద్రంగా తొంగిచూశాయి! □

# పత్రికా సంపాదకులు వాసుదేవరావుగారికి

## 'సాహితీమిత్ర' బిరుద ప్రదానం

'చుక్కాని' పత్రిక ద్వారా అనేకమంది రచయితలను, చిత్రకారులను తెలుగు పాఠకులకు పరిచయం చేసిన ప్రముఖ పత్రికా సంపాదకులు శ్రీ కంచి వాసుదేవరావుగారు కృష్ణాపత్రిక ఉప సంపాదకులుగా పదవీవిరమణ చేసిన సందర్భంలో, అరవింద సాహిత్య సమితివారు తెనాలిలో 'అభినందన' సభ జరిపి 'సాహితీమిత్ర' బిరుదును సమర్పించారు. సభలో ప్రముఖ రచయితలు, ఉపన్యసిస్తూ వాసుదేవరావుగారి బహుముఖ ప్రజ్ఞనీ, నిరాడంబర వైఖరినీ ప్రశంసించారు. హితశ్రీ, దోనేపూడి రాజారావు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, డా॥ కె వి కృష్ణకుమారి, ఉమామహేశ్వర పండితులు, డా॥ రవీంద్రనాధ్ ఉపన్యసించారు

తమకు జరిగిన గౌరవానికి వాసుదేవరావుగారు ఉచితరీతిని కృతజ్ఞతలు వెల్లడించారు. జీవితంలో తాము అనుభవించిన కష్టాలను, నాటి రాష్ట్రపతి బహుమానంతోనూ, నేటి బిరుదప్రదానంతోనూ మరిచిపోగలుగుతున్నామని సజలనయనాలతో వాసుదేవరావుగారు చెప్పారు. ఉత్తమశ్రేణి పత్రికా సంపాదకులుగా ఆంధ్ర సాహితీపరుల, పాఠకుల అభిమానం చూరగొన్న శ్రీ కంచి వాసుదేవరావుగారి సేవలను వినియోగించుకొని వారిని, తద్వారా పత్రికారంగంలో వారికున్న అపారమైన అనుభవసారాన్ని గౌరవించవలసిన బాధ్యతను నేటి ప్రముఖ పత్రికలు గుర్తిస్తాయని ఆశిద్దాం.

— 'ఉష'